కథానిక

# రామయ్యతాత

"గోపి"

"దణ్ణాలండీ రామయ్యగారూ! కరణమయ్య గారు నెక్కా (డబ్బు) కోసం పంపించారండీ" అన్నాడు బారిక ఈరడు, సూర్యోదయం అవుతూంటే, పల్దుంపుడక నోట్లో పెట్టుకొని పరధ్యాన్నంగా పచార్లుచేస్తున్న రామయ్యతో "ఉదయంనుంచి సాయంత్రంవరకూ చూచినా, ఈ యీగల్ని పోల్చుకోడం కష్టంగా ఉంది అన్నీ మనకళ్ళ కొక్కలాగే కనపడతాయే" ఇదీ రామయ్యతాత ఆలోచన. తన పెంపుడు తేనెటీగల్ని చూచుకొంటూ, డెబ్భయ్యో పడిలో కూడా రామయ్యతాత పిడికుచ్చులాగుంటాడు. వెనకాల్నుంచి చూస్తే ఒడ్డు, పొడుగూ, చక్కని మెరుస్తున్న బట్టతల, ఏ పెద్ద రాచకీయవేత్తో అనుకుంటారు తెలియనివాళ్లు.

"రామయ్యతాతకి చిరుచెముడు, డబ్బుడిగీసరికి బ్రహ్మచెముడుగా మారుతుందన్న" కరణంమాటలు జ్ఞప్తికిరాగానే గట్టిగా నకిలించి, అదే విషయాన్ని మళ్ళా చెప్పేడీరడు. "కరణమయ్యగారు నెక్కాకోసం పంపారు బుగతా" అని.

"నువ్వట్రా ఈరిగా, రా, మంచి సమయానికి వచ్చావురా! ఆ...చూశావూ ఆ పట్లన్నీ? ఎన్నీగలున్నాయో, అన్నీకూడా అప్పుడే తేనెకోసం బయల్దేరుతున్నాయి. కలకత్తా నగరంలోకూడా ఇంత ప్రొద్దున్నే, అంత హడావుడి ఉంటుందీ?"

"కరణమయ్యగోరు పంపారండీ..." ఈరిగాడి మాటింకా పూర్తి కాలేదు అందుకున్నాడు రామయ్య.

"పంపిస్తేనే వచ్చావురా, పిడుగా! పంపించకుండా వస్తావుట్రా ఈపట్టులోని రాణి ఈగుండే పంపిస్తేనే ఈకూలి ఈగలన్నీ తేనె యిస్తాయి. ఆజ్ఞాపాలనంటే అలా గుండాలి. ఈ కాలంలో ఎవరి ఆజ్ఞలు వాళ్ళవే! ఒకరు చెప్పడం, మరోళ్లు వినడం ఉందీ? ఈ ఈగల్ని చూచి..." అని ఇంకా దొర్లించుకు పోతున్నాడు.

"కాదు బాబయ్యా, కరణమయ్యగారు నెక్కా మాకేం చెప్పేరూ అంట..."

"ఈరిగా! కందిరీగల్ని ఎవడన్నా లెక్క పెట్టాడురా నీ పిచ్చికాని? మొన్నపట్టు పిండినప్పుడు, ఒక సులభపద్ధతిని లెక్కవేస్తే, ఎన్నొచ్చాయనుకున్నావు—పట్టుకి ఒకకోటి ఈగలకి పైగా తేలాయి. నువ్వు నమ్మతావూ నా మాట!..."

"సిత్తం బాబయ్యా, తమ సెలవైతే, కరణమయ్యగారిని సాయంగా ఎల్లమంటాను తమ దగ్గిరికి..."

"అద్దిగదీ బావుంది. అలా అంటే, ఈగలికే పనుంటే నీకుండవూ? వెళ్లు; తప్పకుండా పంపు మీకరణాన్ని. ఈరిగా, మీకరణం ఉత్త సోమరి సుమీ. అలా గోళ్లు గిల్లుకుంటూ కూర్చోకపోతే నాలుగుపుట్టలు పెంచకూడదూ? మంచితేనె వస్తుందికదా? కరణంకికూడా చూపిస్తా!"

ఈరిగాడు బ్రతుకుదేవుడా అని వెళ్లిపోయాడు మళ్ళా దంతధావన చేస్తూ ఈగల విషయం ఆలోచిస్తూ అన్నాడు. "అడ్డమైనవాళ్ళకీ డబ్బు కావాలి. సోమరులు. ఈ ఈగల్ని చూసేనా బుద్ధి తెచ్చుకోరు."

కొడుకు భద్రం కమ్యూనిస్టు. పంచాయితీ ఎలక్షన్ సందర్భంలో, మీటింగులు, వ్యవహారం జరపడానికి డబ్బుడుగుదామని వచ్చి, తండ్రి చివరి మాటలు, అతన్నే అంటున్నట్టు భావించి హంగుదార్లు ముందుకు నెట్టినా, వెళ్ళడానికి దమ్ముచాలక! "టక్"ని ఆగిపోయాడు. వెనక పాటదారుడు, కొంచెం గుండె దిట్టవుచేసుకొని ముందుకు తోసుకొచ్చి, ప్రారంభించాడు.

"నమస్కారం రామయ్యగారూ! మీ భద్రాన్ని పంచాయితీబోర్డు ప్రెసిడెంటు చేస్తున్నాము. పూర్వంలా ఇది బోడి వ్యవహారం కాదు. నూతన రాజ్యాంగంలో ఇదో పెద్ద పదవి. వార్డుకో అరడజను మంది నిలబడుతూన్నారు!"

ఈగలకి, తనకి మధ్య అంతరాయంగావస్తూన్న

ఈ మానవుల్ని మనసులో తిట్టుకుంటూ, వాళ్ళ పక్కన్నా తిరక్కుండాజబాబిచ్చాడు-"మంచిది నాయనా, మంచిది. ఏదో పనుంటే సోమరితనం తగ్గుతుంది. చూడండి నాయనా, ఈ ఈగ తేనె తీసుకొచ్చి, ఎలా పట్టు చేరుతున్నదో-ఈ తేనె టీగల్ని చూచి మీరు చాలా నేర్చుకోవాలి." రామయ్యతాత, ఆగే సూచనలు అరుదని తోచ గానే అంతకన్నా కొంచం ఎక్కువ చదివిన, క్రామేడ్ మళ్ళీ ఆరంభించాడు.

"ఇంతకీ పంచాయితీబోర్డు ప్రెసిడెంటు కావాలంటే, పదివేలవరకూ ఖర్చుపెడతారు. అలా కాకుండా పార్టీ తరఫున నిలపడ్డచేత, అన్ని ఖర్చులూ పార్టీ భరిస్తుంది. మీరో వంద రూపాయలు చందా ఇప్పిస్తే చాలు."

రామయ్యకి బ్రహ్మాండమైన కోపము ముంచుకొచ్చింది. "చూడు బాబూ, ఇప్పుడీ ఈగ ఎంత మధువు తెచ్చిందంటావ్? పట్లగింజంత కూడా ఉండదు. కాని, రెండు వారాల్లో రెండు సేర్లు తయారౌతుంది. ఎలా ఔతుంది? రోజూ కూడేస్తే సేనూ. ఏమంటావ్? ఖర్చుపెడితే, ఏముంది తేనె? సోమరి మొగ ఈగలున్నాయూ, అవి తేనె తాగడం తప్ప లేవు. అందుకే కూలి ఈగలు వీటిని అడపాతడపా చంపేస్తాయి. అలాగే రాణి ఈగుంది చూశారూ? అది కూలి ఈగల అనుమతి లేనిదీ గుడ్డుకూడా పెట్టదు! ఇంతకన్నా "సామ్యవాదం" ఎక్కడన్నా చూచారూ?" అని బ్రహ్మాండమైన నవ్వుతో తోటల్లా దద్దరిల్లేట్లు చేశాడు. అందులో నవ్వ డాని కేముందో అర్థంకాక"రింగటాలు"కొట్టారు మన కామ్రేడ్లు అంతా.

భద్రం ఒళ్లు మండింది. బ్రహ్మాస్త్రం వేసేస్తా నన్నట్లు ముందుకువచ్చి——

"నాన్నా యివాళ పార్టీకి డబ్బివ్వకపోతే నేనాత్మహత్య చేసుకుంటాను. నేనేదో ప్రెసిడెంటు కావడానికి తంటాలు పడుతూంటే, ఇప్పుడా ఈగల సంగతెందుకు? నాసంగతి ముందు చెప్పు..."అని మొహం చిట్లించుకున్నాడు.

"భేష్! చాలాబాగుంది. పార్టీవంతు డబ్బూ నీవంతు శ్రమా! అలా ఉండాలి సామ్యవాదం అంటే, ఎవళ్ళడబ్బుతోవాడు ప్రెసిడెంటైతే, బజార్లోకొనుక్కున్నట్లుకదూ? ఏ ఈగకెంతశక్తి వుంటే అంత తెస్తుంది. అన్నీ సమంగాతింటాయి. అందుకే వాటికంత సంఘీభావం, అబ్బాయ్! ఒక్కొక్క ఈగ ఎంతకాలం బ్రతుకుతుందనుకున్నావ్..."

"రారా భద్రం, మీనాన్నో పిసనారి చెవిటి, మొండివాడు, కానికూడా ఇవ్వడు" అంటూ అంతా కోపంగా పోయారు.

"భేష్! కోపం వచ్చేంచేస్తారు, వెళ్ళిపోతారు. ఎక్కడికి పారిపోతారు?"

కొసమాటలు విన్న సుభద్ర, ఆ మాటలు కన బడని కూతురు సంగతేనని, ఇంత చల్లగా ఊరు కున్నందుకు కోపంతో, "ఏమండీ! అమ్మాయికెందుకువచ్చిందండీ కోపం? నాతో చెప్పారుకారేం? నిన్న మా తమ్ముడుగారింటికి వెడతానంటే, కామోసనుకున్నా, ఇప్పుడు మా తమ్ముడు 'వనజే దక్కయ్యా?' అంటే 'మీయింటికెడతానందిరా నిన్న స్కూలు విడిచాక, రాత్రి రాకపోతే అక్కడే పడుందనుకున్నా'నంటే తెల్లబోయాడు, అసలు వెంటనే దాన్ని వెతకడముండా లేకపోతే మీ ఈగల్ని చూస్తూ కూర్చోడమేనా?" అని గుక్కతిప్పకోకుండా కీచుగొంతుకతో పూర్తి చేసింది.

రామయ్య సుభద్ర మాట్లాడుతూంటే సాధారణంగా అర్థంచేసుకుందికు ప్రయత్నించెయ్యడు.

"వనజేమంటుందీ, కోపంవచ్చి?" అన్నాడు తాపీగా. "సుబ్బీ ఈ ఈగల్ని చూడు."

"అబ్బబ్బ! ఊరొచ్చి ఏరుమీదపడ్డా, ఏరొచ్చి ఊరుమీదపడ్డా ఒక్కటేగొడవ. ఆ బట్టతలమీద ఒకపోటన్నా ఇవ్వవు వెధవ పురుగులు, చక్కాపాడు పిచ్చివదుల్తుంది. వనజని వెతుకుతారా వెతకరా?"

"ఎందుకూ, సాయంకాలంలోగా గూడుచేరుకుంటుంది మా ఈగల్లాగే."

సుభద్రకి వళ్లుమండింది. "వెంటనేపోయి వెతుక్కొస్తారా లేక ఈగల్ని రొప్పమంటారా? చిన్నదికాదు-చితకదికాదు ఈడొచ్చిన పిల్ల,"అని చేతిలో ఒక కర్రని తీసుకుని, ఈగల్ని రొప్పడానికి ప్రారంభించేసరికి, ఇకలాభంలేదని, కూతుర్ని వెతకడానికి బయలుదేరాడు రామయ్య...